దేవేంద్రుడు—'నిజంగా చంద్రుడు అందానికి ఆనందానికి ట్రేడ్‌మార్క్ డియర్' అంటూ ఓ వెండి గిన్నె అందుకోబోయి తలెత్తేడు. గుర్నాధాన్ని చూసేడు. అన్నంలో వచ్చిన మట్టిబెడ్డన్చూసినట్టు చూసేడు. మట్టిబెడ్డని, అది రావటానికి కారణమైన వాడిని కాలికిందవేసి కసకస నలపగల శక్తి వుండీ, దేవేంద్రుడు తనచూపుల్లో తీక్ష్ణత తగ్గించుకున్నాడు. మట్టిబెడ్డతో పని వుం(టుం)ది గనక తగ్గించుకోవటమే మంచిదనుకున్నాడు. చివరికి గుర్నాధంతో అన్నాడు

'ఏమండీ అప్పుడే వెళ్తున్నానని కబురు పంపేరా? ప్రొద్దుట నేన్చెప్పినవన్నీ వ్రాసేరా?'

'బ్రాంచి ఆఫీసు లెక్కలన్నీ రాసేశాను సార్.'

'మరి హెడ్డాఫీసు లెక్కలుగూడా చూసెళ్ళండి'

గుర్నాధం దురదపెట్టకపోయినా బుర్ర వూరికే గోక్కున్నాడు. ముందు 'మ్మెమ్మె' అని తర్వాత 'మధ్యానంకూడా భోంచెయ్యలేదు...' అనేసేడు.

దేవేంద్రుడి క్కోపం వచ్చింది. చచ్చేంతకోపం వచ్చింది. బీచ్‌లో సుధారాణితో క్వాలిటీ ఐస్క్రీం తింటూ ఇసకలో నడుస్తున్నప్పుడు బాబూబాబూ అంటూ వెంటపడే బిచ్చగాడిమీద వచ్చేంత కోపమొచ్చింది. అంతకోపాన్ని సాధ్యమైనంతవరకూ దిగమింగి మింగలేనిదాన్ని నిష్ఠూరంగా మార్చేసి మాటల్లో కలిపేసేడు.

'మరి మధ్యాహ్నమే చెప్పలేకపోయేరా. వంట మనిషితో చెప్పండేవాళ్ళం. సర్సరే కాసేపుండి భోంచేసివెళ్ళండి!'

గుర్నాధం మనసు చివుక్కుమంది. అతడి కండల్నంటిపెట్టుకున్న విలాసాలూ, యింకా అలాటి మసాలాలూ కండల్తోపాటే కరిగిపోయినప్పటికీ అతగాడి ఎముకలనీడన బ్రతుకుతున్న అభిమానంమాత్రం దృఢంగానేవుంది. అంచేత అతడ్లో అంతోయింతో అహంకూడా వుంది. అవి రెండూ వుండబట్టే చివుక్కుమన్న గుర్నాధం మనసు కస్సుమంది.

'రేయ్ దేవేంద్రుడూ! మధ్యానం కూడా భోజనం చేయలేదంటే మధ్యానంకూడా యింటికెళ్ళలేదని అర్థంరా! అంతేగాని నాకు ఆకలవుతూంది నీ ఎంగిలిచేయి విదిలించూ అనికాదురా! అయినా రేయ్...నీ బాబుల పుణ్యాన నీకు తినేందుకు ఆస్తీ అవకాశాలూ జంటవరాల్లా కలిసొచ్చినైరా! అందుకే అలా తిని యిలా మనగలుగుతున్నావ్రా! నేను అలాటి వరాలేవీ సంపాయించలేకపోయేన్రా! అయినప్పటికీ పస్తులేనా వుంటానుగానీ నీముందు కూటికొరకు దేవిరించనురా! నువ్ ఏడుస్తూ పెట్టే దానికోసం జోలెపట్టన్రా! నువ్ నన్నేదో తప్పుగా అర్థంచేసుకుని వెధవ్వాగుడు వాగుతున్నావ్ జాగ్రత్త!'—అని గుర్నాధం దేవేంద్రుణ్ణి హెచ్చరించేడు లోలోపల.

అసలు మహరాజులా పైకే తిట్టేద్దామన్నంత కోపం వచ్చిందిగాని సరిగ్గా సమయానికి గుర్నాధంలోని గుమాస్తా మనసులేచి అరచింది—

'సిపాయిగుర్నాధం, గుర్నాధం కొడుకు ఎన్జీవో గురవయ్యా, గురవయ్య కొడుకైన ఓ గుమాస్తా గుర్నాధమా! నువ్ దేవేంద్రుడి అల్సేషియన్ కుక్కవు కావు కరిచినా కడుప్రేమతో కట్టేసుకుందుకు! నువ్ ఆఫ్టరాల్ వూరకుక్కగాడివి! నువ్ ప్రేమతో తోక వూపినా కర్రదెబ్బలు తగుల్తూనేవుంటాయ్. వాటికి అలిగి తొలగిపోయేవంటే నీకే నష్టం! బయట కాచుక్కూచున్న మరోవూర కుక్కొచ్చి యింట్లో చేరుతుంది నువ్ దిక్కులేనికుక్కవైపోతావ్! జాగ్రత్త!! తొందరపడి నోరుజారక శాంతించు!!'

గుర్నాధం శాంతించేడు. అతిగా శాంతించేడు గాబోలు మరీ దీనంగా అయిపోయేడు. చేతులు పూరికే నలిపేసుకుంటూ సవినయంగా సంజాయిషీ చెప్పుకున్నాడు—'నా వుద్దేశం అదికాదు సార్! మధ్యానంకూడా యింటికెళ్ళలేదు. యీ పూటేనా పెందరాడే వెళ్దామనీ......'

